జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761


epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

మంగళవారం | 24-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 601 పేజీలు: 4 వెల : రూ.7

## కోట్ల విలువైన దారిపై..
# కబ్జాకోరుల కన్ను!

* అధికారుల 'పచ్చ'జెండా!
* సింగుపురంలో సర్వే నెం.360 భూమిపై వివాదం
* నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి పక్కనే ఇంటి పట్టాల కేటాయింపు
* 40 అడుగుల రోడ్డును మింగేస్తున్న అక్రమ నిర్మాణాలు
* విజనరీ నిర్ణయాలకు తూట్లు పొడుస్తున్న కిందిస్థాయి సిబ్బంది

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 (వార్త):** ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన అధికారులే కంచె అయి చేను మేస్తున్నారా? కోట్లాది రూపాయల విలువ చేసే జాతీయ రహదారి ముఖద్వారం వద్ద నిబంధనలను తుంగలో తొక్కి కబ్జాదారులు చెలరేగిపోతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది సింగుపురం పరిసరాల్లో. సర్వే నెం. 360-2బి2బిలో రోడ్డు కోసం ప్రతిపాదించిన స్థలాన్ని కాజేసేందుకు తెర వెనుక రాజకీయ శక్తులు పావులు కదుపుతుంటే, రెవెన్యూ యంత్రాంగం వారికి వత్తాసు పలుకుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




### అభివృద్ధికి 'అడ్డుకట్ట'.. రోడ్డుపై కబ్జా!

గతంలో రెవెన్యూ మంత్రిగా పనిచేసిన విజనరీ నాయకులు, ఈ ప్రాంత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నెం. 360-2బి2బి లో 40 అడుగుల విశాలమైన రహదారిని కేటాయించారు. వెనుక ఉన్న భూములకు రవాణా సౌకర్యం కల్పించడం ద్వారా అక్కడ భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, పరిశ్రమలు, హైవే అనుబంధ సంస్థలు వచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. అయితే, ఇప్పుడు ఆ 'విజన్'కు కిందిస్థాయి రెవెన్యూ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. 40 అడుగుల దారిని కుదించి, దొంగ పట్టాల పేరుతో అక్రమ నిర్మాణాలకు బాటలు వేస్తుండటం స్థానికంగా కలకలం రేపుతోంది.

### సెలవు రోజున 'నిర్మాణ' పర్వం

ఆదివారం సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. కానీ, అక్రమార్కులకు మాత్రం ఇది కలిసొచ్చే అంశం. నిన్న ఆదివారం కావడంతో, 40 అడుగుల వెడల్పు ఉండాల్సిన ప్రధాన దారిలో సుమారు 10 అడుగులను ఆక్రమిస్తూ ఒక వ్యక్తి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుత ఎమ్మెల్యే గోండు శంకర్ గారు 'రోడ్డు విస్తీర్ణాన్ని తగ్గించవద్దు' అని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, కిందిస్థాయి సిబ్బంది వాటిని బేఖాతరు చేస్తూ నిర్మాణాలకు సహకరించడం గమనార్హం.

### రెవెన్యూ యంత్రాంగం 'మౌన' ముద్ర!

స్థానిక తహశీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు ఈ వ్యవహారంలో పరోక్షంగా సహకరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా దారిగా ఉన్న భూమిని ఒక్కసారిగా ఇళ్ల పట్టాల కోసం కేటాయించడం వెనుక భారీ కుట్ర దాగి ఉంది. కనీసం 40 అడుగుల రోడ్డు లేకపోతే, వెనుక భూములు దారి లేక నిరుపయోగంగా మారుతాయి. తద్వారా అక్కడ రావాల్సిన పెట్టుబడులు వెనుదిరిగే ప్రమాదం ఉంది. ఎమ్మెల్యే ఆదేశాలను సైతం తుంగలో తొక్కి, సెలవు రోజుల్లో అక్రమ నిర్మాణాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఉన్న 'మతలబు' ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### జిల్లా కలెక్టర్ స్పందించాలని వినతి..

కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తిని, భవిష్యత్తు అభివృద్ధికి కీలకమైన రహదారిని కాపాడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది. పట్టాలు ఇవ్వాలనుకుంటే సర్వే నెం. 360లో ఇతర ఖాళీ స్థలాలను పరిశీలించాలని, కానీ రోడ్డును మాత్రం బ్లాక్ చేయవద్దని స్థానికులు విన్నవిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని, సర్వే నెం. 360-2బి2బి లో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకుని, నిష్పాక్షిక విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

### అభివృద్ధికి బాటలు వేస్తారా.. అడ్డంకులు సృష్టిస్తారా?

రోడ్డు ఉంటేనే అభివృద్ధి.. బాట ఉంటేనే ప్రగతి అని భావించే ఈ రోజుల్లో, ఉన్న దారిని కుదించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఒకవైపు ప్రభుత్వం పాత రోడ్ల విస్తరణ కోసం కోట్లాది రూపాయల పరిహారం చెల్లించి మరీ వెడల్పు పనులు చేపడుతుంటే, సింగుపురంలో మాత్రం ఉన్న దారిని ఇళ్ల పట్టాల పేరుతో మూసివేయడం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



### ముప్పు పొంచి ఉంది జాగ్రత్త!


ప్రస్తుతం ఉన్న 40 అడుగుల రోడ్డును తగ్గిస్తే, వెనుక ఉన్న భూములు ఎందుకూ పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. ఇది భవిష్యత్తు అభివృద్ధికి, పారిశ్రామిక విస్తరణకు పెను ఆటంకంగా మారుతుంది. అదే సర్వే నెంబరులో సరిపడా ఖాళీ స్థలం ఉన్నప్పటికీ, కచ్చితంగా రోడ్డు మార్గంలోనే పట్టాలు ఇవ్వడం వల్ల రేపు రోడ్డు విస్తరణ అవసరమైనప్పుడు నిర్మించిన ఇళ్లను మళ్లీ తొలగించాల్సి వస్తుంది. ఇది అటు పేదలకు, ఇటు ప్రభుత్వ ఖజానాకు నష్టదాయక రాకపోకలు నిలిచిపోతే, అక్కడ జరిగే వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలపై ఆధారపడిన వారి ఉపాధి దెబ్బతినే అవకాశం ఉంది.

### ప్రజల నుంచి వినిపిస్తున్న డిమాండ్ ఇదే..

ఇప్పుడే 40 అడుగుల రహదారిని పూర్తిస్థాయిలో విడిచిపెట్టి, అదే సర్వే నెంబరులోని ఇతర ఖాళీ స్థలాల్లో పట్టాలు మంజూరు చేయాలి. అప్పుడే వెనుక ఉన్న భూములకు భవిష్యత్తు ఉంటుంది, కొత్త పరిశ్రమలు వచ్చి స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఎర్రన్నకు నివాళి

* శ్రీకాకుళంలో వాడవాడలా ఎర్రన్న 69వ జయంతి * ఎర్రన్న ఆశయ సాధనకు కృషి చేస్తున్నా : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు





**శ్రీకాకుళం, ఫిబ్రవరి 23(వార్త):** గల్లీ నుండి ఢిల్లీ వరకు.. ఎర్రన్న స్థానం ఎప్పుడూ ప్రత్యేకమైనదని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎర్రంనాయుడు 69వ జయంతి సంధర్భంగా సోమవారం శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా జరిగిన పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. తొలుత తన స్వగృహంలో ఎర్రంనాయుడు చిత్రపటానికి అనంతరం, ఎనబై అడుగుల రహదారి, ఏడు రోడ్ల కూడలి, ప్రజా సదన్ కార్యాలయం, సింహద్వారం కూడలి, పెద్దపాడు కూడలి, నిమ్మాడ కూడలిలో ఎర్రంనాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నిమ్మాడ లోని ఎర్రన్న ఘాట్ లో కుటుంబ సభ్యులతో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా జోహార్ ఎర్రన్న నినాదాలతో శ్రీకాకుళం జిల్లా మారుమోగింది. ఈ సందర్భంగా మీడియాతో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. ఎర్రన్న నాయకత్వం ఎప్పుడూ ఆదర్శప్రాయం అని.. ఆయన రాజకీయ ప్రవేశంతో ఎన్నో మార్పులు చూశామని అన్నారు. ఆయన జీవితం ఓ రాజకీయ పాఠం అని తెలిపారు. ఆయన వారసత్వం నేను తీసుకుని వస్తే.. అశేషంగా అభిమానాన్ని చూపారని అన్నారు. ఎర్రన్న కోసం పెద్ద పెద్ద నాయకులు ఎప్పుడూ తలచుకుంటూ ఉండేవారని.. తాను ఇప్పుడు ఎవరిని కలిసినా ఆ జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ మొదటి ప్రాధాన్యత నా తండ్రికి ఇస్తూ ఉండటం గర్వంగా ఉందని అన్నారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి.. దేశ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలో కీర్తి సాధించిన వ్యక్తి ఎర్రంనాయుడు అని అన్నారు. శ్రీకాకుళం జిల్లా రైతులకు సాగునీటినీ చేరువ చెయ్యడంలో విశేష కృషి చేశారని అన్నారు. నేరేడు బ్యారేజి పై విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఇదే అంశంపై ఆయన ఆశయాన్ని నెరవేర్చేందుకు తను కృషి చేస్తున్నానని.. ఇప్పటికే కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్ పాటిల్ తో కూడా భేటీ అయ్యానని, పరిస్థితి వివరించామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఆ దిశగా విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఒరిస్సా ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, టిబ్యునల్ కోర్టు తీర్పు అమలు కోసం కూడా ప్రయత్నాలు ముమ్మరం చేశామని అన్నారు. ఖచ్చితంగా కూటమి హయాంలోనే నేరేడు బ్యారేజి ప్రారంభోత్సవం చేసి తీరుతామని స్పష్టం చేశారు. అదేవిధంగా జిల్లాకు పరిశ్రమలు తీసుకురావడం ద్వారా అభివృద్ధి, ఉపాధి చేరువ అవుతాయని ఎర్రంనాయుడు నమ్మేవారని.. ఆ ఆశయాలకు కొనసాగింపుగా నేడు అనేక పరిశ్రమలను జిల్లాకు తీసుకువస్తున్నామని అన్నారు. కేంద్ర బడ్జెట్ లో రేర్ ఎర్త్ కారిడార్ ప్రకటన ద్వారా మొదటి లబ్ధి పొందేది శ్రీకాకుళం జిల్లా అని.. ఆ ప్రాజెక్టులను శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. పోర్ట్ పనులు కూడా ఫస్ట్ షిప్ బెర్త్ చేసి శరవేగంగా పనులు జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు, ఎర్రంనాయుడు అభిమానులు, స్థానికులు విశేషంగా పాల్గొన్నారు.

## నరసన్నపేటలో ఆక్రమణలపై కలెక్టర్‌కు వినతి

### -చర్యలు తీసుకోవాలని కోరిన వైసీపీ నాయకులు

**నరసన్నపేట, ఫిబ్రవరి 23(వార్త):** నరసన్నపేట పట్టణంలో ఆక్రమణలు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ నాయకులు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంపై గతంలో గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినట్లు వైసీపీ నేత ధర్మాన కృష్ణ చైతన్య తెలిపారు. సోమవారం ఇదే అంశంపై మరల జిల్లా కలెక్టరును కలిసి దరఖాస్తు అందజేశారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలపై వెంటనే పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని నాయకులతో కలిసి ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# మహనీయుడు.. ఎర్రన్నాయుడు..!

### -ఘనంగా నివాళులర్పించిన నాయకులు

### -మందసలో పలు సేవా కార్యక్రమాలు



**మందస, ఫిబ్రవరి 23(వార్త):** జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన సిక్కోలు సూర్యుడు, ఉద్దాన ప్రజల దాహార్తిని తీర్చిన అపర భగీరథుడు స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు అని పలువురు వక్తలు అన్నారు. కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు 69వ జయంతి వేడుకలు మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అధ్యక్షతన మందసలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దుర్యోధన, కార్యదర్శి సాలినా మాధవరావు, ముఖ్య నాయకులు మాట్లాడుతూ కింజరాపు ఎర్రంనాయుడు కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక మొదటగా ఉద్దానం ప్రధాన కారణమైన త్రాగు నీటి సమస్యను పూర్తిగా నిర్మూలించడానికి ఎంతో కృషి చేశారన్నారు. జీడి, మామిడి, కొబ్బరి లాంటి పంట సాగు సస్య శ్యామలం చేయడానికి ఆయన ఎంతో దోహదపడ్డారన్నారు. ఎర్రన్న భౌతికంగా దూరమైనప్పటికీ ప్రతీ తెలుగుదేశం కార్యకర్త గుండెల్లో ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన స్మృతులు చెరగనివని, చెరపలేనివని, స్వర గాంభీర్యం..పార్టీ కి కొండంత అండగా నిలిచిన వ్యక్తిత్వమన్నారు. ఎర్రన్నాయుడు ఉత్తరాంధ్ర ఉరుము.. మెరిసిన మెరుపు.. ప్రత్యర్థుల గుండెల్లో కుదుపు అన్నారు. సమాజం పట్ల బాధ్యత గుర్తెరిగి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎర్రన్నాయుడు మన మధ్యలేకపోయినా ఆయన నిబద్ధత, విశ్వసనీయత ప్రజలలో పార్టీతో నిలిచే ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న త్రాగు నీటి పథకాలు, బీటీ రోడ్లు ఆయన మంజూరు చేయించినవేనని గుర్తు చేశారు. ఎర్రన్నాయుడు ఆశయాలను కొనసాగించాలని బాధ్యత అందరిపై ఉందన్నారు. శాసన సభ్యురాలు గౌతు శిరీష మన నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆమె వెంట ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ కొనసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీపీ నాయకులు డుంకురు తిరుపతిరావు, రట్టి లింగరాజు, దేవరశెట్టి మార్కేండేయులు, మహేశ్ రాజాన, గువ్వాడ లక్ష్మీనారాయణ, ముంజేటి చంద్రశేఖర్, సవర చంద్రశేఖర్, చౌదరి మురళి, పోలాకి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సబ్ కమిటీలకు శిక్షణ



**మందస, ఫిబ్రవరి 23(వార్త):** అన్ని గ్రామాల్లో కూడా ఆరోగ్య సబ్ కమిటీలకు శిక్షణ ఇచ్చి, తద్వారా ప్రతీ గ్రామంలో కూడా అందరికీ అవగాహన కల్పిస్తున్నట్లు వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన(ఎఫ్.ఎన్.హెచ్.డబ్లు) ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాలపై శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ కుటుంబానికి సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని కోరారు. ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కిచెన్ గార్డియన్, న్యూట్రి గార్డియన్ లో ఆకు కూరలు, కాయగూరలను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరికీ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలును పరిశుభ్రం గా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రమణమ్మ, కోశాధికారి శారద, అకౌంటెంట్లు కళ్యాణి, భాగ్యలక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పరికరాల పంపిణీ



**మందస, ఫిబ్రవరి 23(వార్త):** గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో దివ్యాంగులకు పరికరాలు పంపిణీ కార్యక్రమం మందసలో జరిగింది. కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు 69వ జయంతి సందర్భంగా గురుదేవ చారిటబుల్ ట్రస్ట్(విజయనగరం) సహకారంతో, మదర్ చారిటబుల్ ట్రస్ట్(సొండిపూడి) వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారెడ్డి భాస్కరరావు ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులకు ట్రై సైకిల్, వీల్ చైర్స్, బ్లైండ్ స్టిక్స్, ఇయర్ రింగ్ మిషన్స్, దుస్తులు పంపిణీ చేయడం చేశారు. దివ్యాంగులు ఆనందాన్ని వ్యక్తపరిచారు. గురుదేవ చారిటబుల్ సేవల్ని ప్రశంసిస్తూ కొనియాడారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు 69వ జయంతి సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు జరగడం అభినందనీయమన్నారు. దివ్యాంగులకు ఎంతో మంచి సేవలు అందిస్తున్నందుకు భాస్కరరావుని ప్రశంసించారు. టీపీపీ నాయకులు డుంకురు తిరుపతిరావు, రట్టి లింగరాజు, దేవరశెట్టి మార్కేండేయులు, మహేశ్ రాజాన, గువ్వాడ లక్ష్మీనారాయణ, ముంజేటి చంద్రశేఖర్, సవర చంద్రశేఖర్, చౌదరి మురళీ, పోలాకి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## హరిపురంలో 'ఆదర్శ గురువు'లకు సన్మానం



**మందస, ఫిబ్రవరి 23(వార్త):** హరిపురంలో ఆదర్శ గురువులకు ఘనంగా సన్మానం జరిగింది. 43 సంవత్సరాల క్రితం 1982-83 ఎస్ఎస్సీ బ్యాచ్ కు చెందిన శిష్యులు కలయికతో పాటు గురువులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. సన్మాన గ్రహీతలు జినగ ఆదినారాయణ, కొర్ల పాపారావు, రత్నాల శంకరరావు, కాసులదేవు లోకనాథం, భాష్యం మోహనరావు తదితర గురువులకు శిష్య బృందానికి ఒకే వేదిక మీదకు తెప్పించిన మార్పు జగన్మోహనరావు, మిత్ర బృందము, జన్ని వాసు, తోట చంద్రశేఖర్, చిక్కాల జగన్నాథరావు, జుత్తు పురుషోత్తం, గుంట ఆనందరావు, కొర్రాయి ధర్మారావు, గుడియా సింహాద్రి, మజ్జి వైకుంఠరావు, బతకల చంద్రయ్య, కరగాన నీలకంఠం, బూరెల్లి కోదండరావు, సారి పూర్ణ చంద్రరావు, వాయలపల్లి తిరుపతి, శెమల్ల యోగీశ్వరరావు, గున్న రామారావు, సానా మాధవరావు, మార్పు వెంకటరమణ, పుల్లా వాసుదేవరావు, నల్ల పరశురాం, లింగం ప్రభాకరరావు తదితరుల ఆధ్వర్యంలో హరిపురం-బాలిగాం జంక్షన్ లో ఉన్న స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీస్ లో ఆదర్శ గురువులకు సన్మాన కార్యక్రమం జరిగింది. స్వర్గస్తులైన గురువులకు శ్రద్ధాంజలి ఘటించారు. అదేవిధంగా స్వర్గస్తులైన స్నేహితులకు కూడా శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.

## శ్రీముఖలింగేశ్వర స్వామికి రూ.1,00,005ల విరాళం

### - చెక్కు అందజేసిన రవికుమార్, ఛాయారాణి దంపతులు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 23(వార్త):** శ్రీకాకుళం వాస్తవ్యులు కురసా రవికుమార్, ఛాయారాణి దంపతులు భక్తి భావంతో శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానం వారికి రూ.1,00,005లు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఏడుకొండలు, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌కి సోమవారం అందజేశారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు ఈ విరాళం వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దంపతుల సేవాభావాన్ని ఆలయ అధికారులు, భక్తులు అభినందించారు.





## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



**మందస, ఫిబ్రవరి 23(వార్త):** అంగన్‌వాడీ సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మందస మండలంలోని అంగన్ వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్ వాడీ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రెండు రోజుల పాటు దీక్షలలో భాగంగా మొదటి రోజుగా సోమవారం మండలంలోని సగం మంది అంగన్ వాడీ టీచర్స్, సగం మంది హెల్పర్స్ పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కేశవరావు, ఎన్.గణపతి, యూనియన్ నాయకులు కె.హేమలత, పి.ఉమాలక్ష్మి లు మాట్లాడుతూ అంగన్ వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలను అంగన్ వాడీలకు వర్తింపచేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటి ఇవ్వాలని, ఐసీడీఎస్ కు బడ్జెట్ లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఇవన్నీ గతంలో అంగీకరించి అమలు చేస్తామని హామీ ఇచ్చి, మినిట్ కాపీ కూడా ఇచ్చి.. అమలు చేయకుండా తాత్సారం చేయడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ నెల 25, 26 తేదీలలో జిల్లా కేంద్రంలో జరిగే దీక్షలను, మార్చి 2న విజయవాడ మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజేశ్వరి, సునీత పాడి, పార్వతి, ప్రమీల ఆర్.రాజేశ్వరి, సాయమ్మ, ఎన్.పుణ్యావతి, ఎన్.గౌరి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. రైస్ మిల్ కార్మికసంఘం నాయకులు కె.కృష్ణారావు, ఎన్.లచ్చయ్య, పి.కూర్మారావులు పాల్గొని సంఘీభావం తెలిపారు.


## 'పునర్విక' చికిత్సకు ఏకమైన మందస ఇన్‌ఫ్లుయెన్సర్లు

### -విరాళాల సేకరణ




**మందస, ఫిబ్రవరి 23(వార్త):** వెల్దుర్తికి చెందిన 11నెలల చిన్నారి పునర్విక అరుదైన స్పైనల్ మస్కులర్ అట్రోఫీ వ్యాధితో పోరాడుతోంది. ఆమె ప్రాణాలను కాపాడటానికి అవసరమైన రూ.16 కోట్ల విలువైన జోల్జెన్‌స్మా ఇంజెక్షన్ కోసం మందస మండలానికి చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యువత స్పందించారు. చిన్నారి తండ్రి సురేష్ చేస్తున్న ఆవేదనను చూసి చలించిన వీరంతా మందసలో సమావేశమై పునర్విక కోసం విరాళాలు సేకరించాలని నిర్ణయించారు. ఇన్‌స్టాగ్రామ్ పేజీల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేయాలని కోరుతున్నారు. ఈ సేవా కార్యక్రమంలో మందస ప్రాంతానికి చెందిన అనేక మంది సోషల్ మీడియా స్టార్స్, క్రియేటర్స్ హలో మందస, సోమేష్, లక్కీ, పాండు, ప్రవీణ్, మోహన్, లతీష్, చాందినీ టెంబురు, ప్రసాద్, మణి, మందస మీమర్, బర్ల హరికృష్ణ, దున్న హరి, పాఢీ స్టూడియో పాల్గొన్నారు. వీరందరూ కలిసి గ్రామ గ్రామాన తిరుగుతూ లేదా డిజిటల్ మాధ్యమాల ద్వారా పునర్విక పరిస్థితిని వివరిస్తున్నారు. మన చిన్న సహాయం ఒక చిన్నారి ప్రాణాన్ని కాపాడుతుందనే నినాదంతో విరాళాల సేకరణ ప్రారంభించారు. మందస మండల ప్రజల నుండి ఈ ప్రయత్నానికి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో పునర్వికను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన మందస యువతను, ఇన్‌ఫ్లుయెన్సర్లను స్థానికులు అభినందిస్తున్నారు.

## నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన ప్రభుత్వం : శాంతి




**కొత్తూరు, ఫిబ్రవరి 23(వార్త):** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిలువునా వంచిస్తోందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, పాతపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఆకాశమంత ఆశలు చూపి, అధికార పీఠం దక్కించుకున్న తర్వాత నిరుద్యోగులను నట్టేట ముంచడం చంద్రబాబు నాయుడు కి అలవాటైన విద్యేనని ఆమె విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో మరియు ప్రచార సమయంలో ప్రతి ఏటా జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు, ఇప్పుడు ఫిబ్రవరి మాసం ముగుస్తున్నా దాని ఊసే ఎత్తకపోవడం నిరుద్యోగులను దారుణంగా మోసగించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు ఇచ్చే సమయంలో లేని ఇబ్బందులు ఇప్పుడు పాలనలోకి వచ్చాక ఎందుకు వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. నిరుద్యోగ యువత ఓట్లతో గెలిచి, ఇప్పుడు వారికి మొండిచేయి చూపడం ప్రభుత్వ నైతికతకే విరుద్ధమని ధ్వజమెత్తారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు కొండంత అండగా నిలిచారని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టడమే కాకుండా, కొత్త నోటిఫికేషన్ల విషయంలో కాలయాపన చేస్తూ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది యువత కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు ఖర్చు చేస్తూ నోటిఫికేషన్ల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాట మార్చడం వల్ల వారంతా తీవ్ర నిరాశలో ఉన్నారని రెడ్డి శాంతి గారు పేర్కొన్నారు. ప్రజలను మోసగించడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం మరోసారి తన అసలు స్వరూపాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే మెగా డీఎస్సీతో పాటు అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరుద్యోగుల పక్షాన వైఎస్ఆర్సీపీ పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతుందని ఆమె హెచ్చరించారు.



## ఎర్రంనాయుడు దేశం గర్వించదగ్గ వ్యక్తి



**మెళియాపుట్టి, ఫిబ్రవరి 23(వార్త):** కేంద్ర మాజీ మంత్రి, దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు దివంగత నేత కింజరాపు ఎర్రంనాయుడు దేశం గర్వించదగ్గ వ్యక్తులలో ఒకరిని పిఎసిఎస్ అధ్యక్షుడు సలాన మోహనరావు అన్నారు. ఎర్రంనాయుడు జయంతి సందర్భంగా మెళియాపుట్టి మండల కేంద్రంలో గల రాధా గోవిందస్వామి ఆలయంలో మంగళవారం జయంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్రంనాయుడు జిల్లాకు చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, యువకులు తదితరులు ఉన్నారు.

## శ్రద్ధగా చదవండి.. ఉత్తమ ఫలితాలు సాధించండి

### -లింగాలవలస జడ్పీ పాఠశాలలో

### పదో తరగతి విద్యార్థులతో ఎంఈఓ సమీక్ష



**జలుమూరు, ఫిబ్రవరి 23(వార్త):** పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ ఎం.వి.ఆర్.ఎస్ ప్రసాదరావు తెలిపారు. సోమవారం జలుమూరు మండలం లింగాలవలస జడ్పీ పాఠశాలను సందర్శించిన ఆయన పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యాంశాలపై దృష్టి సారించి సమయ పాలనతో చదవాలని సూచించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే అమలవుతున్న యాక్షన్ ప్లాన్‌ను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన వైపు కృషి చేయాలని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'చలో శ్రీకాకుళం' వాల్ పోస్టర్ ఆవిష్కరణ

### - మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ సాధనకు 26న జిల్లా కేంద్రంలో ధర్నా

**సారవకోట, ఫిబ్రవరి 23(వార్త):** సారవకోటలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 'చలో శ్రీకాకుళం' ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ (ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హామీ మేరకు మెళియాపుట్టిని ఐటీడీఏ కేంద్రంగా ప్రకటించి అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 'చలో శ్రీకాకుళం' ధర్నాలో జిల్లాలోని గిరిజనులు భారీగా పాల్గొంటారని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏ ఏర్పాటు అవసరమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు

**-జలుమూరులో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎంపీపీ**

**జలుమూరు, ఫిబ్రవరి 23(వార్త):** గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జలుమూరు మండలానికి రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ రథాన్ని మంజూరు చేసినట్లు ఎంపీడీవో బి.చిన్నమ్మడు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి స్వచ్ఛ రథంలో వేయాలని ప్రజలకు సూచించారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పంచాయతీల్లో శుభ్రతను కాపాడేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామాల్లో చెత్త నిర్వహణపై అవగాహన కల్పించి, పారిశుధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎల్లమ్మతల్లి.. భక్తుల కల్పవల్లి..!



**-శ్రీనివాసపురంలో 26న జామి యాత్ర**

**-మందస రాజుల హయాంలో ఆలయ నిర్మాణం**

**-136వ వార్షికోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు**

**-ఏటా పెరుగుతున్న భక్తులు**

**మందస, ఫిబ్రవరి 23(వార్త):** కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరున్న జామి ఎల్లమ్మతల్లి జాతర ఈ నెల 26న జరుగనుంది. మందస మండలంలోని మూలిపాడు పంచాయతీలో గల గోపాలపురం-శ్రీనివాసపురం గ్రామాల్లో జామి ఎల్లమ్మతల్లి ఉంది. ప్రతీ ఏటా మహాశివరాత్రి అనంతరం జామి యాత్ర జరుగుతుంది. మందస-సోంపేట మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ఎల్లమ్మతల్లిని దర్శించుకుంటారు. మందస ప్రాంతంలోని భక్తులకు ఎక్కువగా కాలినడకనే యాత్రకు వెళ్లడం ఆచారంగా వస్తోంది. ఈ సందర్భంగా శ్రీనివాసపురంలో పలు సాంస్కృతిక, ఆధ్మాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మంజూష సంస్థానాన్ని మహారాజులు పరిపాలన నుంచే యాత్ర ఇక్కడ కొనసాగుతోంది.

## స్థల పురాణం..

ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలకు సంబంధించి మంజూష(మందస) కేంద్రంగా రాజులు పరిపాలించేవారు. అప్పటిలో ఈ ప్రాంతంలో ఒక తెల్లని నాగుపాము ఈ ప్రాంతంలో సంచరించేదట. ఎవరికీ హానీ తలపెట్టని నాగుపాము ప్రస్తుతం ఉన్న పుట్టలోకి వెళ్లి, వస్తుండేది. కొంతకాలం తరువాత నాగుపాము క్రమేపి అంతర్ధానమైందని దీంతో ఈ పుట్టవద్ద మందస రాజులు 1890వ ఆలయం నిర్మించారని చెబుతున్నారు. రాజా శ్రీనివాసరాజమణిదేవ్ హయంలో జామి యాత్ర వైభవంగా జరిగేది.

అప్పటి నుంచి గుడి వద్ద జామి యాత్ర జరుగుతోంది. ముడుపులు ఆలయంపైకి విసిరితే భక్తులు కోరిన కోర్కెల ఎల్లమ్మతల్లి కోర్కెలను తీర్చుతుందని భక్తుల నమ్మకం. భక్తులు గుడిపైకి బియ్యం, నాణేలు, పసుపు, కుంకుమలతో కూడిన ముడుపులను విసురుతారు. జామి యాత్ర ఎల్లమ్మతల్లి అని చెబుతున్నప్పటికీ, ఆలయం లోపల పెద్ద పుట్ట మాత్రమే ఉంటుంది. పుట్టకు భక్తులు పూజలు చేస్తారు. గోపాలపురం-శ్రీనివాసపురం గ్రామాలకు సంబంధించిన ఉన్న జామి ఎల్లమ్మతల్లి యాత్రను ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు.

## ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు..

ఈ నెల 26(గురువారం)న ఉదయం 6గంటలకు అమ్మవారి అభిషేకం, 7గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ఆలయ సందర్శన, ప్రత్యేక పూజ, జాతర జరుగుతాయి. సాయంత్రం 3గంటల నుంచి జాతర తిరువీధుల మహోత్సవం జరుగుతుందని శ్రీజామి ఎల్లమ్మతల్లి పూజాకమిటీ ప్రతినిధులు తెలిపారు. రాత్రి 8గంటల నుంచి ఆర్ఆర్ డాన్స్ ఈవెంట్ నిర్వహించబడుతుందన్నారు. భక్తులు పాల్గొని జామిఎల్లమ్మను దర్శించుకుని, తీర్థ, ప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



# అలుదు జడ్పీ పాఠశాలలో.. యాక్షన్ ప్లాన్ అమలుపై ఎంఈవో సమీక్ష



**సారవకోట, ఫిబ్రవరి 23(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు 'యాక్షన్ ప్లాన్' పేరిట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 భూలక్ష్మి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం సారవకోట మండలం అలుదు జడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠ్యాంశాలపై పూర్తి దృష్టి సారించి ఉపాధ్యాయులు అందిస్తున్న సలహాలు, సూచనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. సమయపాలనతో చదువుకుంటేనే ఉత్తమ ఫలితాలు సాధించగలమన్నారు. పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గొట్టాబ్యారేజ్ నుంచి తాగునీటిని అందించండి

**-అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



**నరసన్నపేట, ఫిబ్రవరి 23(వార్త):** అసెంబ్లీలో సోమవారం జరిగిన జీరో అవర్ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నరసన్నపేట నియోజకవర్గంలోని తాగునీటి సమస్యలను ప్రస్తావించారు. సారవకోట, పోలాకి మండలాల్లో తీవ్రమైన తాగునీటి సమస్య నెలకొందని తెలిపారు. సారవకోటలో నీటి లభ్యత తక్కువగా ఉందని, జలజీవన్ మిషన్ ద్వారా గొట్టా బ్యారేజ్ నుంచి తాగు నీటిని సరఫరా చేయాలని కోరారు. పోలాకి మండలానికి కూడా శాశ్వత పరిష్కారం కల్పించి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి



**సారవకోట, ఫిబ్రవరి 23(వార్త):** అంగన్వాడీ సిబ్బందికి వేతనాలు పెంచాలని, ఐసీడీఎస్ బడ్జెట్‌ను పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సారవకోట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ & హెల్పర్స్ సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలని కోరారు. ఐసీడీఎస్ ప్రారంభమై 50 సంవత్సరాలు గడిచినా అంగన్వాడీ సిబ్బందిని కార్మికులుగా గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వము వెంటనే సమస్యలపై స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో పలువురు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



# సీసీ కెమెరా నిఘాలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**-నరసన్నపేటలో 1,700 మంది విద్యార్థుల హాజరు**

**- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్ఐ**

**నరసన్నపేట, ఫిబ్రవరి 23(వార్త):** నరసన్నపేట మండలంలో సోమవారం నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు సీసీ కెమెరా నిఘాలో ప్రారంభమయ్యాయి. మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాలలో మొత్తం 1,700 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ప్రతి పరీక్షా గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పకడ్బందీగా పర్యవేక్షణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులను పంపే ముందు పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. నకిలీ చర్యలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఎస్సై బి.గణేశ్ సోమవారం స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పరీక్షలు సజావుగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారన్నారు.



# అన్నా క్యాంటీన్ ప్రారంభమెప్పుడో..?

**- రూ.60 లక్షలతో నరసన్నపేటలో నిర్మాణం పూర్తి**

**- త్వరగా ప్రారంభించాలని కోరుతున్న స్థానికులు**



**నరసన్నపేట, ఫిబ్రవరి 23(వార్త):** నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన అన్నా క్యాంటీన్ భవనం పూర్తయినప్పటికీ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణం పూర్తయి దాదాపు పది రోజులు గడిచినా ప్రారంభంపై స్పష్టత లేకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్యాంటీన్ ప్రారంభమైతే పేదలకు కేవలం ఐదు రూపాయలకే భోజనం అందించే అవకాశం ఉంటుందని ప్రజలు ఆశిస్తున్నారు. అయితే మరికొద్ది రోజుల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ప్రారంభం వాయిదా పడే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. అధికారులు తక్షణమే స్పందించి క్యాంటీన్‌ను ప్రారంభించాలని, పేద ప్రజలకు ఉపశమనం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సైబర్ నేరాలపై మహిళలూ.. అప్రమత్తం



**మెళియాపుట్టి, ఫిబ్రవరి 23(వార్త):** ప్రస్తుత సమాజంలో సైబర్ తదితర నేరాలపై జరుగుతున్న అంశాలపై ప్రతి మహిళలు అవగాహన పరుచుకుని అప్రమత్తంగా ఉండాలని సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సిలర్లు (ఆర్థిక అక్షరాస్యత కేంద్రం. నందిగాం) జోగేంద్ర నాయుడు, రాములమ్మ, రామారావులన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక ఉపాధిహామీ పనుల వద్ద ఉపాధి వేతన దారులతో సోమవారం నాడు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలియజేస్తూనే ఇంకా ఎవరైనా చదువురాని వారు ఉన్నట్లయితే వారు ప్రతీ ఒక్కరూ చదవటం, రాయటం నేర్చుకోవాలని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే సెల్ ఫోన్లు ద్వారా వచ్చే అనవసరపు కాల్స్ స్వీకరించొద్దని, తాము బ్యాంకు నుంచి అని చెప్పి ఒటిపిలు మీ ఫోన్ కి వచ్చింది ఆ నెంబర్ చెప్పండి అని ఇలాంటి వివరాలను అడుగుతారని అలాంటి టైం లోనే తెలివిగా ఏటువంటి ఆర్థిక పరమైన అంశాలకు సంబంధించి అటువంటి వారికి తెలియపరచకూడదని అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు వేతనదారులు తదితరులు ఉన్నారు.

# పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలి



**జి.సిగడాం, ఫిబ్రవరి 23(వార్త):** గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పని ఒత్తిడి తగ్గించాలంటూ ఎంపీడీవో జి. రామకృష్ణారావు, డిప్యూటీ ఎంపీడీవోకు సోమవారం పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ స్థాయిలో వ్యవహారాలను చూసుకుంటూనే, సచివాలయాల సిబ్బంది చేయాల్సిన పనులను కూడా ఒకే సమయంలో పర్యవేక్షణ చేయాల్సి రావడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. తరచు సర్వేలు, యాప్‌లు, నివేదికలు, సమీక్షలతో తీవ్ర పనిభారం, ఒత్తిడికి గురవుతున్నామని అధిక పని బత్తిడి వల్ల అనారోగ్యములకు గురైయ్యి ఆసుపత్రిలను ఆశ్రయించవల్సిన పరిస్థితి నెలకుంటుందని ఆవేదన చెందుతున్నారు. కార్యదర్శులపై రోజురోజుకూ పెరుగుతోన్న ఒత్తిడిని తగ్గించేందుకు సమయపాలనలో మార్పులు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల పరిపాలనా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. తులసీ ప్రసాద్ సాహు, వడగ గౌరీశంకరరావు, రాజా రమేష్, దుర్గారావు, జాడ వెంకటనాయుడు, సుందరమ్మ, ధర్మవరపు సతీష్‌కుమార్, జాడ కిషోర్, కొంచాడ శ్రీనివాసరావు, పైల శ్రీరాములు, రంజిత్, ఝాన్సీ, చైతన్య కుమారి, మజ్జి ధనలక్ష్మి, లావణ్య, ఎదూరి హరిబాబు, సురేష్, మండల తదితర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పునర్విక కోసం జోలె పట్టిన సోంపేట యువత




**సోంపేట, ఫిబ్రవరి 23(వార్త):** నెల్లూరు జిల్లాకు చెందిన పునర్విక అనే ఆరు నెలల పాప అరుదైన శ్వాసకోసవ్యాధితో తీవ్ర ఇబ్బంది పడుతోంది. వైద్యులు పరీక్షించిన అనంతరం ఎస్ఎంఎ 1 అనే వ్యాధిగా నిర్ధారించారు. ప్రతి లక్ష మంది జనాభాలో పుట్టిన వెంటనే ఒకరికి అరుదుగా ఈ వ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. పేద కుటుంబానికి చెందిన ఈ పసిపాప ప్రాణాలు కాపాడాలంటే 16 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని వైద్యులు పేర్కొనడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ పునర్విక కోసం జోలె పట్టి చందాలు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే సోంపేటకు చెందిన పలువురు యువకులు కలిసి విరాళాల సేకరణను సోమవారం చేపట్టారు. మనసున్న ప్రతి ఒక్కరూ తోచిన సహాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. 16 కోట్ల రూపాయలతో విదేశాల నుంచి ఈ వ్యాధి నివారించేందుకు అవసరమైన ఒక ఇంజక్షన్ కొనుగోలు చేస్తారని స్థానిక యువకులు తెలిపారు.

# ఘనంగా ఎర్రన్న 69వ జయంతి వేడుకలు

**- అడ్డపనస టీడీపీ కార్యాలయంలో ఘన నివాళి**



**సారవకోట, ఫిబ్రవరి 23(వార్త):** మాజీ కేంద్రమంత్రి దివంగత కింజరాపు ఎర్రం నాయుడు 69వ జన్మదిన వేడుకలను సోమవారం సారవకోట మండలం అడ్డపనస టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం అధికార పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్ ధర్మాన తేజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా ఎర్రన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, పీఏసీఎస్ ఛైర్మన్ తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు. పలువురు కార్యకర్తలు హాజరై ఎర్రన్న సేవలను కొనియాడారు.



# ఎర్రన్నా.. నిన్ను మరువలేమన్నా!

**-ఆయన సేవలు నిరుపమానం**

**- కాళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు**

**- నరసన్నపేటలో ఘనంగా నివాళులు**

**నరసన్నపేట, ఫిబ్రవరి 23(వార్త):** దివంగత నేత కింజరాపు ఎర్రం నాయుడు శ్రీకాకుళం జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ అధ్యక్షుడు రోనంకి కృష్ణమ నాయుడు పేర్కొన్నారు.

సోమవారం నరసన్నపేటలోని మార్కెట్ ప్రాంగణం మరియు టీడీపీ కార్యాలయంలో ఎర్రన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎర్రన్న జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటి చెప్పారని, ప్రజా సేవలో ఆయన చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శమని అన్నారు. ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసిన మహానేతగా ఆయనను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పోందరి కార్పొరేషన్ అధ్యక్షుడు దామోదర పాల్గొన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరై ఎర్రన్న సేవలను స్మరించుకున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సత్ప్రవర్తనతో మెలగాలి

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 23(వార్త):** ముద్దాయిలు జైలులో సత్ప్రవర్తనతో మెలగాలని, శిక్షా కాలం ముగిసిన తర్వాత సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు హితవు పలికారు. చట్టపరమైన చిక్కులతో ఇబ్బంది పడుతున్న వారు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని ఆయన సూచించారు. సోమవారం అంపోలులోని జిల్లా కారాగారాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీల కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, వారికి అందుతున్న ఆహారం, ఆరోగ్య సదుపాయాలు జైలులో పారిశుద్ధ్యాన్ని స్వయంగా పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేసి, ముద్దాయిలకు నాణ్యమైన ఆహారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జైలర్ దివాకర్ నాయుడు, కారాగార సిబ్బంది పాల్గొన్నారు.







### ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల వద్ద

## పటిష్ట బందోబస్తు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభమైన వార్షిక ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా, జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పలు పరీక్షా కేంద్రాలను పోలీసు అధికారులు సందర్శించారు. ఈ క్రమంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావుతో పాటు పలువురు డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పరీక్షా కేంద్రాలను సందర్శించి కేంద్రాల ఆవరణంలో తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అనుకూల పరిస్థితులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. అదేవిధంగా, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో ఉన్న జిరాక్స్ షాపులు, ఇంటర్నెట్ సెంటర్లు, ఇతర కమ్యూనికేషన్ కేంద్రాలు పరీక్షలు పూర్తయ్యేంతవరకు తెరవకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని విధాలుగా సమన్వయంతో చర్యలు చేపడుతోంది.

## పోలీసు శాఖలో ఆర్మ్డ్ రిజర్వు విధులు కీలకం




**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 23 (వార్త):** జిల్లా ఆర్మ్డ్ రిజర్వు పోలీసులకు ప్రతి సంవత్సరం నిర్వహించే 14 రోజుల పునశ్చరణ తరగతులను (మొబిలైజేషన్) జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఎచ్చెర్ల పోలీసు మైదానంలో అదనపు ఎస్పీ కె.వి. రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను మరోసారి గుర్తు చేసుకుని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ మొబిలైజేషన్ కార్యక్రమం ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. 14 రోజులు ఈ పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్డ్ రిజర్వు పోలీసులు పోలీసు శాఖకు బలమైన ఆధారస్తంభమని అన్నారు. విధులు నిర్వహించే సమయంలో నిష్పక్షపాతంగా, అంకితభావంతో, నిజాయితీతో పనిచేసి ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. రిజర్వు పోలీసుల వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మరియు శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరచేందుకు క్రింది అంశాల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఆర్మ్డ్ రిజర్వు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లు, నియమిత వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్. శేషాద్రి, ఆర్ఐ కృష్ణ ప్రసాద్, ఆర్ఎస్సైలు మరియు ఆర్మ్డ్ రిజర్వు సిబ్బంది పాల్గొన్నారు.

## 28లోగా 'జీవన ప్రమాణ పత్రం' సమర్పించాలి

శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 (వార్త): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు ఈ నెల 28వ తేదీలోగా తమ వార్షిక జీవన ప్రమాణ పత్రాలను (లైఫ్ సర్టిఫికెట్) తప్పనిసరిగా సమర్పించాలని శ్రీకాకుళం హెడ్ క్వార్టర్స్ ఉప ఖజానా అధికారి (ఎస్టీవో) చింతాడ రామారావు ఒక ప్రకటనలో కోరారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో పెన్షన్ చెల్లింపుల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఉప ఖజానా కార్యాలయ పరిధిలో మొత్తం 6,748 మంది పెన్షనర్లు ఉండగా, ఇప్పటివరకు 5,828 మంది మాత్రమే ధ్రువీకరణ పత్రాలను సమర్పించారు. ఇంకా 920 మంది పెన్షనర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంది. పెన్షనర్లు తమ సమీపంలోని ఖజానా కార్యాలయాల్లో కానీ, నెట్ సెంటర్లలో కానీ లేదా తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో సంబంధిత యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని జీవన ప్రమాణ పత్రాలను సమర్పించవచ్చని ఆయన వివరించారు. వృద్ధాప్యం లేదా అనారోగ్య కారణాల వల్ల బయోమెట్రిక్ పడని పెన్షనర్లు ఆందోళన చెందవద్దని, వారు నేరుగా జిల్లా కేంద్రంలో ఉప ఖజానా కార్యాలయాన్ని సంప్రదించి తమ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని సూచించారు. జీవో ఎంఎస్ నెం. 315 ప్రకారం పెన్షన్ పొందుతున్న వారు శ్రీకాకుళం కార్యాలయ పరిధిలో 82 మంది ఉండగా, వారిలో కేవలం 25 మంది మాత్రమే ధ్రువీకరణ పత్రాలు సమర్పించారని ఎస్టీవో తెలిపారు. మిగిలిన వారు ఈనెల 28వ తేదీలోగా సంబంధిత పత్రాలతో వచ్చి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.

## 25న శ్రీకాకుళంలో జాబ్ మేళా

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 (వార్త):** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పథక సంచాలకులు పి. కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సంస్థలైన డీ-మార్ట్, ఫ్యూషన్ ఫైనాన్స్‌లో అసోసియేట్, క్యాషియర్, పర్చేజ్ ఆఫీసర్, రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ ఎంపికలు జరుగుతాయి. 10వ తరగతి ఆపై అర్హత కలిగి, 19 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ. 16,000 నుండి రూ. 26,000 వరకు వేతనం లభిస్తుంది. డీ-మార్ట్ ఉద్యోగులకు హైదరాబాద్‌లో, ఫ్యూషన్ ఫైనాన్స్ ఉద్యోగులకు శ్రీకాకుళంలో పని ప్రదేశాలు ఉంటాయి. ఆసక్తి గల అభ్యర్థులు తమ వెంట రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అప్‌డేటెడ్ బయోడేటాతో బుధవారం ఉదయం 9:30 గంటలకు శ్రీకాకుళంలోని నెహ్రూ యువ కేంద్రం వద్దకు హాజరుకావాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 7989744612, 8106945415 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని పి.డి. తెలిపారు.

### శ్రీకాకుళంలో

# డయేరియా

*** ఆరా తీసిన మంత్రి అచ్చెన్నాయుడు * పలు వార్డుల్లో పర్యటించిన వైద్యాధికారులు, కలెక్టర్**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 23(వార్త):** శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో అతిసార (డయేరియా) కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అప్రమత్తమయ్యారు. నగరపాలక సంస్థ పరిధిలోని గోల్కొండ రేవు, దమ్మల వీధి పరిసర ప్రాంతాల్లో వ్యాధి వ్యాప్తి చెందడానికి గల కారణాలు, రోగుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి సమగ్రంగా ఆరా తీశారు. మంత్రి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ కూర్మనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. వ్యాధి వ్యాప్తిని నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేయాలని మంత్రి సూచించారు. తాగునీటి పైపుల్లో మురుగునీరు చేరినట్లయితే వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. వార్డుల్లో క్లోరినేషన్ నిర్వహించి, బ్లీచింగ్ పౌడి చల్లే చర్యలను బలోపేతం చేయాలని సూచించారు. అతిసార రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రత్యేక వైద్య బృందాలను నియమించాలని మంత్రి ఆదేశించారు. అలాగే రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో పాటు వైద్యులతో కూడా మాట్లాడి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.




### ఆ వీధుల్లో వేడిచేసిన నీరు మాత్రమే తాగాలి

ఆ వీధుల్లో వేడి చేసిన నీరు మాత్రమే త్రాగాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజలను కోరారు. డయేరియా కేసులు నమోదైన వీధుల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకి వీధి, దమ్మలవీధి, గుడివీధి, మంగువారితోట నాలుగు వీధుల్లో కొన్ని డయేరియా కేసులు నమోదైనట్లు చెప్పారు. ఈ కేసులు ఉన్న చోట్ల మున్సిపల్ కార్పొరేషన్ నుండి వచ్చే నీటిని త్రాగవద్దని చెప్పారు. గత రెండు, మూడు రోజుల నుండి నీరు నిల్వ ఉంటే వాటిని బయట పారవేయమని చెప్పారు. సంబంధిత ప్రాంతాలకు మున్సిపల్ కార్పొరేషన్ నుండి ట్యాంకులు ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు. ఏరియాలో ప్యాక్ చేసిన బాటిల్ వాటర్ దొరితే అవి త్రాగవచ్చన్నారు. త్రాగే నీరు వేడిచేసుకొని త్రాగాలన్నారు. వైద్య పరంగా సమస్యలు ఉంటే తక్షణమే జిజిహెచ్ లేదా అందుబాటులో ఉన్న పిహెచ్సీలకు రిపోర్ట్ చేయాలన్నారు. కలెక్టర్ వెంట డిఎంహెచ్ఓ డాక్టర్ కె. అనిత, వైద్య సిబ్బంది ఉన్నారు.

## మహోన్నత నేతకు నివాళి

*** కింజరాపు ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన మంత్రి అచ్చెన్నాయుడు * కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి23(వార్త):** ప్రజాసేవను ప్రాణంగా భావించిన మహోన్నత నాయకుడు కింజరాపు ఎర్రన్నాయుడు తనకు అన్నయ్యగానే కాదు, మార్గదర్శకుడిగా, జీవితానికి దిక్సూచిగా నిలిచారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం దివంగత నేత ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా విజయవాడలోని మంత్రి అచ్చెన్నాయుడు క్యాంప్ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులతో కలసి ఎర్రన్నాయుడు విగ్రహానికి మంత్రి అచ్చెన్నాయుడు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిస్వార్థంగా పోరాడిన ఆయన అడుగుజాడల్లో నడవడం తనకు గర్వకారణమని, అలాంటి మహానేతకు తమ్ముడిగా పుట్టడం తన జీవితంలో అత్యంత అదృష్టమని భావోద్వేగంతో పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్యం, నిబద్ధత, ప్రజాహితం పట్ల అంకితభావం ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని, ఆయన ఆశయ సాధనకే తన ప్రతి శ్వాస అంకితం చేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు నాయకత్వంలో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందన్నారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపడంలో ఆయన ప్రత్యేక శైలి ఉండేదని గుర్తుచేశారు. ఢిల్లీలో ఉత్తరాంధ్ర స్వరంగా అభివృద్ధి కోసం ఎర్రన్నాయుడు గళం విప్పారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి న్యాయం జరగాలనే దృఢ సంకల్పంతో ఆయన పోరాడారని చెప్పారు. కేంద్ర మంత్రిగా పనిచేసిన సమయంలోనూ ప్రజా సంక్షేమాన్ని ముందుంచుకుని నిర్ణయాలు తీసుకున్న నాయకుడని కొనియాడారు.



### రాజకీయాల్లోకి స్ఫూర్తి నిచ్చిన మహానేత

ఎర్రన్నాయుడు నాయకత్వం స్ఫూర్తిగా తీసుకుని ఎంతో మంది యువకులు రాజకీయాల్లోకి వచ్చారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే తపన, నిబద్ధత, నిజాయితీ ఆయన వ్యక్తిత్వంలో అంతర్లీనంగా ఉన్నాయని చెప్పారు. ఆయన చూపిన మార్గం ఈ తరానికి ఆదర్శమని అభిప్రాయపడ్డారు.

### నా అన్నగా ఉండటం నా అదృష్టం

ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు భావోద్వేగానికి లోనై మాట్లాడుతూ, అలాంటి గొప్ప , ప్రజాహిత నాయకుడు నా అన్నగా ఉండటం నా జీవితంలో గొప్ప అదృష్టం. ఆయన ఆశయాలు, విలువలు, ప్రజాసేవా దృక్పథం నాకు ఎప్పటికీ మార్గదర్శకం అని అన్నారు. ఎర్రన్నాయుడు గారి ఆశయ సాధన కోసం తాను నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలంతా ఎర్రన్నాయుడు గారి సేవలను స్మరించుకున్నారు. ఆయన అభివృద్ధి దృష్టి, దూరదృష్టి నాయకత్వం, ప్రజలతో ఉన్న అనుబంధం గురించి కొనియాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, బెందాలం అశోక్, గొండు శంకర్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## వినతులు స్వీకరిస్తూ.. బాధలకు భరోసా ఇస్తూ..

**నిమ్మాడలో ప్రజాదర్బార్ నిర్వహించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**



**శ్రీకాకుళం/కోటబొమ్మాళి, ఫిబ్రవరి 23(వార్త):** కింజరాపు ఎర్రంనాయుడు 69 వ జయంతి సందర్భంగా నిమ్మాడ లో పర్యటించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. జయంతి కార్యక్రమాల అనంతరం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జయంతి సందర్భంగా వేలాదిమందితో నిమ్మాడ పరిసరాలు కిక్కిరిసిపోగా.. వందలాదిమంది వినతులను సైతం కేంద్ర మంత్రికి చేరవేశారు. ఓపికగా వాటన్నిటినీ స్వీకరించిన రామ్మోహన్ నాయుడు.. వారికి భరోసా కల్పించారు. అవసరమైన వాటికి సత్వర పరిష్కారం అందిస్తూ.. మిగిలిన వాటిని సంబధిత అధికారులకు పరిష్కారంకై సమాచారం ఇచ్చారు.

### నిమ్మాడ లో ఎస్.బి.ఐ నూతన శాఖను ప్రారంభించిన కేంద్ర మంత్రి

స్థానిక రైతులకు, పరిశ్రమలకు మరింత ఉపయుక్తంగా ఎస్.బి.ఐ బ్యాంక్ నిమ్మాడ శాఖ మారనుందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం నిమ్మాడలో ఎస్.బి.ఐ నూతన శాఖను ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ పరిసరాలను కలియతిరిగారు. పలు కౌంటర్లను ప్రారంభించారు. మొదటి లావాదేవిని జరిపిన స్థానికులకు సంబంధిత ఎక్నాలజ్మెంట్ పత్రాలను అందించారు. తర్వాత తన సొంత ఊరిలో తనకి కూడా ఒక బ్యాంక్ అకౌంట్ ఖచ్చితంగా ఉండాలని తెలుపుతూ.. నూతన అకౌంట్ ఫారం ను స్వయంగా నింపి, సంతకాలు చేసి బ్యాంక్ అధికారులకు అందజేశారు. తన స్వగ్రామం నిమ్మాడ లో ఎస్.బి.ఐ లాంటి విలువైన సేవలు అందిస్తున్న బ్యాంక్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. స్థానిక రైతులకు, పరిశ్రమల వారికి ఇది మరింత ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. స్థానికంగా వ్యాపారాలు మరింత వృద్ధి చెందుతాయని తెలిపారు. ఇక్కడి అన్నదాతలకు మరింత లబ్ధి చేకూర్చే పథకాలపై స్థానికంగా విస్తృత ప్రచారం కల్పించాలని బ్యాంక్ అధికారులను కోరారు. వారి ఆర్థిక లావాదేవీల్లో ఎస్.బి.ఐ కీలక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లక్ష్యాలను చేరుకోవడంలో బ్యాంకుల ది కీలక పాత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి.ఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పాటిల్, ఎస్బిఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ హేమంత్ కుమార్, డిప్యూటీ జెనరల్ మేనేజర్ రాహుల్ సకారియా, రీజినల్ మేనేజర్ ఉదయ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ నాగరాజు, ఎస్బిఐ స్టాఫ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ సతీష్, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ డి.ఎన్.ఆర్ కుమార్, శ్రీకాకుళం రీజియన్ రీజనల్ సెక్రెటరీ వెంకటరమణ, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్, కింజరాపు హరివరప్రసాద్, కింజరాపు ప్రభాకరరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.




## మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

*** జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 (వార్త):** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 14న జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా ఉభయ పక్షాల మధ్య సయోధ్య కుదిర్చి, దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులను తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. 'రాజీయే రాజమార్గం' అని, దీనివల్ల ఇరు వర్గాలూ విజయం సాధించినట్లవుతుందని, భవిష్యత్తులో వారి మధ్య సత్సంబంధాలు నెలకొంటాయని పేర్కొన్నారు. మోటారు వాహన ప్రమాద కేసుల్లో ఇన్సూరెన్స్ కంపెనీలు సానుకూలంగా స్పందించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చాలని జడ్జి కోరారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు పోలీసు యంత్రాంగం కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు జిల్లా జడ్జి పి. భాస్కరరావు, మూడవ అదనపు జిల్లా జడ్జి సిహెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎల్. ఫణి కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె. హరిబాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్, అదనపు ఎస్పీ కె.వి. రమణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'రెవెన్యూ క్లినిక్'

*** కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * 21 శాఖలు 127 ఫిర్యాదుల స్వీకరణ**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 23 (వార్త):** జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన 'రెవెన్యూ క్లినిక్' (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ క్లినిక్‌లో మొత్తం 21 శాఖలకు సంబంధించి 127 అర్జీలు అందాయి. అందులో ప్రధానంగా రెవెన్యూ నుంచిఅత్యధికంగా 43 ఫిర్యాదులు అందగా, అందులో 21 ఇప్పటికే అధికారుల పరిశీలనలోకి వెళ్లాయి. సెర్ప్‌నకు సంబంధించి 31 అర్జీలు రాగా, 11 అర్జీలను అధికారులు పరిశీలించారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 15 ఫిర్యాదులు అందాయి. వీటితో పాటు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (7), నీటి వనరుల శాఖ (4), విద్యుత్ శాఖ (4), వ్యవసాయం, గనులు, ఇతర ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించి పలు వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు అధికారులు చూసిన అర్జీల కంటే పెండింగ్‌లో ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడటంలో నిర్లక్ష్యం వహించరాదని ఆయన హెచ్చరించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546